క్లుప్తంగా

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ



భిక్కనూరు: మండల ఎస్సైగా అంజనేయులు పదవీ బాధ్యతలను బుధవారం స్వీకరించారు. అంతకు ముందు ఎస్సైగా పనిచేసిన సాయికుమార్ మృతి చెందడంతో ఆయన స్థానంలో దోమకొండలో ఎస్సైగా పనిచేస్తున్న అంజనేయులును భిక్కనూరు ఎస్సైగా పోలీస్ ఉన్నతాధికారులు నియమించారు. ఈమేరకు ఆయన బుధవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పదవి బాధ్యతలను స్వీకరించారు. ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యల గురించి నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు.

బ్యాంకు ఉద్యోగాలు సాధించిన బంజార బిడ్డలు



ఉద్యోగాలు సాధించిన చరణ్, సుమలత

బాన్సువాడ రూరల్: పోచారం తండాకు చెందిన బంజారా బిడ్డలు ఇద్దరు బుధవారం ప్రకటించిన బ్యాంకు ఉద్యోగ ఫలితాల్లో విజయం సాధించారు. తండాకు చెందిన నిరుపేద రైతు గోప్యానాయక్ కుమారుడు చరణ్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఉద్యోగం సాధించగా.. పోచారం గ్రామ మాజీ ఉప సర్పంచ్ బలరాం నాయక్ కుమార్తె సుమలత పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఉద్యోగం సాధించింది. ఒకే తండాకు చెందిన ఇరువురు ఉద్యోగాలు సాధించడంపై తండావాసులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నిధులు కేటాయించండి



ఎల్లారెడ్డిరూరల్: 12వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, కౌన్సిలర్ నీలకంఠం వినతిపత్రం అందించారు. 12వ వార్డు పరిధిలోని పోలీస్ స్టేషన్ నుంచి హౌజింగ్ బోర్డు కాలనీ, లింగారెడ్డిపేటతండా, ఒడ్డెర కాలనీలలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వారు కోరారు.

పాఠశాలకు ఐడీబీఐ రూ.లక్ష సహాయం



కామారెడ్డి అర్బన్: సామాజిక సేవ కార్యక్రమం కింద ఐడీబీఐ పట్టణ పరిధిలోని దేవునిపల్లి కాకతీయ నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం రూ.లక్ష విలువైన డెస్క్ బెంచీల కొనుగోలు కోసం చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఐడీబీఐ హైదరాబాద్ జోనల్ సీజీఎం శరత్ కుమార్ కామత్, అధికారులు వాసుదేవన్, వెంకటేష్, కే.నరేష్, స్థానిక బ్రాంచ్ మేనేజర్ వెంకటరమణ, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ గంగా కిషన్, 35వ వార్డు కౌన్సిలర్ పి.కృష్ణాజీ రావు, పాఠశాల హెడ్‌మాస్టర్ శైలజ పాల్గొన్నారు.

నర్సింగ్ చదువుతున్న విద్యార్థినికి..

ఎల్లారెడ్డిరూరల్: తిమ్మారెడ్డి గ్రామంలో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న నిరుపేద విద్యార్థిని వెంకికీ మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ బుధవారం రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు.

తిమ్మారెడ్డిలో చెక్కుల పంపిణీ

తిమ్మారెడ్డి గ్రామంలో డబుల్ బెడ్ రూం నిర్మాణాలకు సంబంధించి ముగ్గురు లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు బుధవారం చెక్కులను అందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సామెల్ తదితరులున్నారు.

6న ఇస్కాన్ ఆధ్యాత్మిక గురువు రాక

కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ శ్రీకృష్ణచైతన్య సంఘం (ఇస్కాన్) కెనడాకు చెందిన ఆధ్యాత్మిక గురువు భక్తి రాఘవ స్వామి మహారాజ్ ఈనెల 6న కామారెడ్డి కేంద్రానికి వస్తున్నారని ప్రతినిధి వెంకటదాస్ ప్రభు తెలిపారు. భక్తి రాఘవస్వామి మహారాజ్ రాక సందర్భంగా 6న ప్రవచనాలు, ప్రసాద వితరణ కార్యక్రమాలుంటాయని ఆయన వెల్లడించారు.



మద్నూర్‌ల కేక్ కట్ చేస్తున్న పిల్లలు



మద్నూర్‌లో వేసిన కొత్త సంవత్సరం ముగ్గు



బీబీపేటలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

కొత్త సంవత్సరం వచ్చే.. ఆనందం తెచ్చే



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇస్కాన్ కేంద్రంలో..



చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



బాన్సువాడ బీడీ వర్కర్స్ కాలనీలో నూతన సంవత్సరం వేడుకలు జరుపుకుంటున్న చిన్నారులు

జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. మంగళవారం అర్ధరాత్రి దాటాక కేకులు కట్ చేసి ఒకరికొకరు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బుధవారం ఉదయం కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ అందరి ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు దర్శనమిచ్చాయి. ఆలయాలు, చర్చిలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుఖ సంతోషాలతో ఏడాది గడవాలని దేవుడిని వేడుకున్నారు. పలు చర్చీలలో అన్నదానం ఏర్పాటు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



నెల్లి సాయి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బైరాపూర్ విఠలేశ్వర ఆలయంలో..



నాగిరెడ్డిపేట: త్రిలింగేశ్వరాలయంలో..



లింగంపేట: మత్తడి పోచమ్మకు పూజలు చేసిన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు



తాడ్వాయిలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



కొత్తాబాది చర్చిలో ..



ఎల్లారెడ్డిరూరల్: ఏదమినిస్ట్రీస్ చర్చిలో అన్నదానం



జిల్లా కేంద్రంలోని కాకతీయనగర్ కాలనీలో వేసిన ముగ్గు

ప్రముఖులకు శుభాకాంక్షలు



షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ



కేటీఆర్‌తో జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

నూతన సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులను స్థానిక నేతలు కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఎమ్మెల్యేకు మిఠాయి తినిపిస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్



శుభాకాంక్షలు తెలుపుతున్న నాగిరెడ్డిపేట మాజీ సర్పంచ్



ఎంపీ సురేశ్ షెట్కార్, షబ్బీర్ అలీతో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి



ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్‌తో బీఆర్ఎస్ పట్టణ నాయకులు

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



బాన్సువాడ రూరల్: కాద్లాపూర్‌లో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు బుధవారం గ్రామస్తులు, దళిత సంఘం నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఏప్రిల్ 14 అంబేడ్కర్ జయంతి లోపు నిర్మాణ పనులు పూర్తి చేసి ఘనంగా ఆవిష్కరణ కార్యక్రమం చేపడతామని వారన్నారు. అంబేడ్కర్ సంఘం నాయకులు నెర్రె నర్సింహులు, బంగారు మైసయ్య, మన్నెచిన్న సాయిలు, గైని రవి, గ్రామ మాజీ సర్పంచ్ భాస్కర్ నాయక్, గ్రామస్తులు దాదేకర్ సురేష్, పత్రుబాబు, పుండరిక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాంపల్లితండాలో భోగ్ బండార్



లింగంపేట(ఎల్లారెడ్డి): రాంపల్లితండాలో బుధవారం జగదాంబ మాత, సంత్ సేవాలాల్ మహారాజ్‌కు గిరిజనులు భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో టెంకాయలు కొట్టి హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. పాడి పంటలు సంవృద్ధిగా పండాలని, పిల్లా పాపలను చల్లగా చూడాలని కొలిచారు. ఆలిండియా బంజారా శక్తిపీఠ్ ప్రధాన కార్యదర్శి పోరదేవి, ఆలిండియా బంజారా సేవా సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు బద్యానాయక్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన భద్రాచలం వెళ్లిన భక్తులు



భద్రాచలం వెళ్తున్న భక్తులు



మద్నూర్ నుంచి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని దెగుల్‌వాడి గ్రామానికి చెందిన భక్తులు కాలినడకన భద్రాచలంకు వెళ్లారు. ముక్కోటి ఏకాదశి రోజున భద్రాచలంలోని శ్రీరాముడి దర్శించుకునేందుకు 11 మంది భక్తులు గత నెల 31న వారి స్వగ్రామం నుంచి పాదయాత్రగా బయల్దేరారు. పాదయాత్ర బుధవారం నాగిరెడ్డిపేట మండలకేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామానికి చెందిన పలువురు భక్తులు ప్రతియేడు కాలినడకన భద్రాచలం వెళ్లి వైకుంఠ ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకుంటామని అన్నారు.

షిర్డీకి భక్తుల పాదయాత్ర

మద్నూర్(జుక్కల్): మహరాష్ట్రలోని పుణ్యక్షేత్రమైన షిర్డీకి బుధవారం మండల కేంద్రానికి చెందిన పలువురు భక్తులు పాదయాత్రగా బయదేరివెళ్లారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర ప్రారంభించారు. 15 రోజుల పాటు 450 కిలోమీటర్ల పాదయాత్ర చేపడతామని వారు పేర్కొన్నారు. ఈ నెల 14న షిర్డీకి చేరుకుంటామని వారు అన్నారు.

కొత్త సంవత్సరం వేళ.. కేసుల నమోదు



గాంధారిలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలో మంగళవారం రాత్రి న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. ఎస్సై ఆంజనేయులు ముందస్తు జాగ్రత్తలు, హెచ్చరికలతో యువకులు ఎవరూ అల్లర్లు చేయలేదు. ఎవరి ఇళ్లలో వారు వేడుకలు జరుపుకున్నారు. పోలీసులు రాత్రంతా బందోబస్తు నిర్వహించారు. వాహనాలు తనిఖీలు చేసి 10 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలో ద్విచక్రవాహనాలు తనిఖీ చేయగా ఐదు డ్రంక్ అండ్‌డ్రైవ్ కేసులు నమోదు చేశామని స్థానిక ఎస్సై భువనేశ్వర్ తెలిపారు. రాత్రి వేళ మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని చెప్పినా పెడచెవిన పెట్టి మద్యం తాగి వాహనాలు నడపడంతో కేసులు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

రైతులకు అందుబాటులో యూరియా



లింగంపేట(ఎల్లారెడ్డి): భవానిపేట, పోతాయిపల్లి, శెట్పల్లి, లింగంపేట, అయిలాపూర్ గ్రామాల్లోని గోదాముల్లో రైతులకు కావాల్సిన యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. రైతులకు ఈ–పాస్ ద్వారా ఎరువులు విక్రయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. డీలర్లు, రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు.

ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



దుబ్బాక ప్రసాద్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పిట్లవాడ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుబ్బాక ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పిట్ల భాస్కర్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉప కార్యదర్శిగా కూన సంతోష్, కోశాధికారిగా పిట్ల లక్ష్మణ్, సలహాదారులుగా బాలయ్య, బాలరాజు, దుబ్బాక రాములు, పెద్ద లక్ష్మణ్, దాదే బాలరాజ్, సమాచార కార్యకర్తగా కూన శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

లింగాపూర్ ముదిరాజ్ –1 సంఘ కార్యవర్గం

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని లింగాపూర్ ముదిరాజ్ –1 సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోడూరి శేఖర్, ఉపాధ్యక్షుడిగా కె.కృష్ణ, కార్యదర్శిగా కె.సిద్ధిరాములు, కోశాధికారిగా ఇమ్మడి నవీన్, సంయుక్త కోశాధికారిగా కార్యదర్శిగా కె.పెద్ద నర్సింలు, సంయుక్త కార్యదర్శిగా చిట్టబోయిన ప్రతాప్ ఎన్నికయ్యారు.

మార్కెట్ నిర్మాణానికి నిధుల అడ్డంకి

- మూడేళ్లుగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు
- ఇబ్బందులు పడుతున్న మటన్, చికెన్ వ్యాపారులు



బాన్సువాడలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

బాన్సువాడ : పట్టణంలోని పాత వీక్లీమార్కెట్ ఆవరణలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమైనా పూర్తి స్థాయిలో నిధులు విడుదల కాలేదు. రెండున్నరేళ్లుగా నిర్మాణం ముందుకు సాగడం లేదు. సరిపడా నిధులు విడుదలై ఉంటే 2022 చివరి మాసంలోనే మార్కెట్ అందుబాటులోకి వచ్చేది. కానీ ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదు.

రోడ్లపైనే వ్యాపారం...

సరైన మార్కెట్ సదుపాయం లేక వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పాత బాన్సువాడకు వెళ్లే దారిలో బాలికల ఉన్నత పాఠశాల ముందు ఇరుకైన రోడ్లకు ఇరువైపులా కూరగాయలు, పండ్లు, చికెన్ విక్రయాలు కొనసాగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో పాటు దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. ఎక్కడ అంటువ్యాధులు ప్రబలుతాయోనని భయంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఒకే చోట అన్ని రకాల వ్యాపారాలు నిర్వహించుకునేలా మార్కెట్ నిర్మాణం చేపట్టేందుకు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. పాత వీక్లీ మార్కెట్ ఆవరణలో రెండెకరాల స్థలంలో 2022 ఫిబ్రవరి 5న అప్పటి స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పనులను ప్రారంభించారు. కూరగాయల బ్లాక్‌లో 60 గదులు, మాంసాహార బ్లాక్‌లో 30 గదులు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు స్లాబ్‌లు మాత్రమే పూర్తి చేశారు. కాంట్రాక్టర్‌కు సుమారుగా రూ.60 లక్షలు మాత్రమే చెల్లించారు. మరో రూ. 1.40 కోట్లు రావాల్సి ఉండడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు.

ప్రభుత్వం దృష్టి సారిస్తేనే....

అయితే స్థానిక పరిస్థితులు, పెరిగిన ధరల ప్రకారం మార్కెట్ నిర్మాణానికి వ్యయం పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. అదనంగా కావాల్సిన నిధులను ప్రగతి నిధుల నుంచి వినియోగించుకోవాలని గత ప్రభుత్వం ఆదేశించింది. పట్టణ ప్రగతి పనులకే నిధులు రావడం లేదు. కొత్తగా మార్కెట్ నిర్మాణానికి ఎక్కడి నుంచి నిధులు సమీకరించుకోవాలో మున్సిపల్ యంత్రాంగానికి అంతు చిక్కని సమస్యగా మారింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి మార్కెట్ నిర్మాణానికి సరిపడా నిధులు కేటాయించి పూర్తి చేయాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు.

కుక్కల బెడద అరికట్టాలి



తాడ్వాయిలో ప్రధాన రహదారిపై తిరుగుతున్న కుక్కలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల పరిధిలో తరుచుగా కుక్కలు దాడులు చేసి గాయపరుస్తున్నాయని, వెంటనే అధికారులు స్పందించి కుక్కల దాడులను ఆపి కుక్కల బెడద అరికట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండలంలోని ఎర్రాపహాడ్, దేమికలాన్, క్రిష్టాజీవాడి, కరడ్‌పల్లి, సోమారం, నందివాడ, తాడ్వాయి తదితర గ్రామాలలో కుక్కలు దాడులు చేయడంతో ప్రజలు ఆస్పత్రి పాలవుతున్నారు. ప్రతి గ్రామంలో గల చికెన్ సెంటర్ యజమానులు, నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలను రోడ్లు, గ్రామాలలో ఎక్కడ పడితే అక్కడ పారేస్తున్నారు. దీంతో కుక్కలు వాటిని తిని స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. అలాగే కొన్ని గ్రామాలలో గేదె దూడలను గాయపరుస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షిప్తం

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతుంది. మంగళవారం నాటికి లక్షా 68 వేల 511 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రహరీని నిర్మించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హరిజన వాడ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీని నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం 40 శాతం మాత్రమే ప్రహరీ ఉంది. మిగతా 60 శాతం లేకపోవడంతో పశవులు, కుక్కలు, విష పురుగులు, పాములు వస్తున్నాయి. వంటగది కూడా లేకపోవడంతో పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం వండుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని పాఠశాల చుట్టూ ప్రహరీని నిర్మించి విద్యార్థులు, ఉపాధ్యాయుల భయాన్ని తీర్చాలని కోరుతున్నారు.

రాష్ట్ర అధ్యాపకుల సంఘం అధ్యక్షుడికి సన్మానం



పిట్లం(జుక్కల్): తెలంగాణ బీసీ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల కేంద్రానికి చెందిన కాముని సుదర్శన్ ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం బీసీ రాజ్యాధికార సంఘం కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి కుమ్మరి యాదగిరి ఆధ్వర్యంలో కాముని సుదర్శన్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. నాయకులు చింతల శంకర్, చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సబ్బని ధర్మపురి, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి రాజేందర్, రాజంపేట మండలం అధ్యక్షుడు మురళి, తదితరులు పాల్గొన్నారు.

హాకీ మైదానం బాగు చేయించాలని వినతి

కామారెడ్డి అర్బన్: మండలంలోని గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హాకీ మైదానం బాగు చేయించాలని పాఠశాల హాకీ క్రీడాకారులు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణా రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ప్రీమియం లీగ్ ఆడుతున్న క్రీడాకారులు ఎమ్మెల్యే గర్గుల్‌లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలో తమ విజ్ఞప్తిని ఒక్కొక్కరుగా వేశారు.

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శబరిమాత దివ్యసమాధి, ప్రతిమ, చిత్రపటం, పాదుకలను రకరకాల పూలతో అందంగా అలంకరించి పూజలు చేశారు. తాడ్వాయి నుంచే కాకుండా ఇతర మండలాల నుంచి కూడా భక్తులు భారీగా తరలి వచ్చారు. హాజరైన వారికి అన్నదానం చేశారు.